క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 45, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 20, అల్లం 220, వెల్లుల్లి 140.

సీపీఆర్‌పై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రపంచ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో సీపీఆర్‌ను ఏ విధంగా నిర్వహించాలో వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు రవీంద్ర, శశివర్ధన్, రవితేజ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలిని ఇంటికి చేర్చిన కానిస్టేబుల్



వృద్ధురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

హఫీజ్‌పేట్ : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వద్ద ప్రధాన రహదారిపై ఓ వృద్ధురాలు (80) తప్పిపోయి దిక్కుతోచని స్థితిలో ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న గచ్చిబౌలి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆమెను గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగడానికి మంచినీరు అందించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు తన పేరు జానకమ్మ అని ఊరు భీమవరం చెప్పడంతో ఆమె సంబంధీకుల వద్దకు పెట్రోలింగ్ వాహనాన్ని పిలిపించి పంపించారు.

మీర్‌కి సన్మానం

మాదాపూర్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సుప్రసిద్ధ దర్శకుడు, కెమెరామెన్ మీర్‌ని శనివారం సన్మానించారు. అనంతరం భావనవాహిని చిత్ర చూడామణి అనే బిరుదును అందించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం స్వరాభినయ నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జేడి లక్ష్మీనారాయణ, డాక్టర్ శోభారాజు తదితరులు పాల్గొన్నారు.

పాలన చేరువలో

- వార్డు స్థాయికి అధికార వికేంద్రీకరణ
- ఇప్పటికే భవనాల పరిశీలన, గుర్తింపు
- అధికారుల నియామకం పూర్తి



ఆదర్శనగర్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు చేయనున్నది ఈ భవనంలోనే..

శేరిలింగంపల్లి/మియాపూర్: అధికార వికేంద్రీకరణకు రంగం సిద్ధమైంది. వార్డు స్థాయి పరిపాలనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశం రాగానే ఈ పరిపాలనా ప్రక్రియ ఆరంభమవుతుంది. ప్రతి చిన్న పనికి జీహెచ్‌ఎంసీ సర్కిల్, జోనల్ ఆఫీస్‌కు వెళ్ళాల్సిన పనిలేకుండా డివిజన్ స్థాయిలోనే అధికారులు అందుబాటులో ఉండడంతో సమస్యకు సత్వర పరిష్కారం లభించే అవకాశం కలుగబోతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జంట సర్కిళ్లు చందానగర్, శేరిలింగంపల్లి ఉండగా.. చందానగర్ సర్కిల్‌లో మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్, చందానగర్ డివిజన్లు ఉండేవి, శేరిలింగంపల్లి సర్కిల్‌లో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లు ఉన్నాయి. వీటి స్థానంలో ప్రతి డివిజన్‌కు ఒక పరిపాలనా కేంద్రం అందుబాటులోకి రానుంది. దీంతో డివిజన్ స్థాయిలో ఇక అధికారులు అందుబాటులో ఉంటారు.

వార్డు పరిపాలన ఇలా..

- కొత్తగా అమలులోకి రానున్న వార్డు పాలనలో అధికార యంత్రాంగం కూడా సిద్ధంగా ఉంది.
- అధికార యంత్రాంగం ఇలా.. ప్రతి వార్డులో ఒక పరిపాలనాధికారి, వార్డు ఇంజనీర్, టౌన్ ప్లానర్, ఎంటమాలజిస్ట్, కమ్యూనిటీ ఆర్గనైజర్, శానిటరీ జవాన్, యూబీడీ సూపర్‌వైజర్ వంటి అధికారులుంటారు. వీరి నియామకం ప్రక్రియ దాదాపు పూర్తయింది.
- ప్రజా సమస్యల సత్వర పరిష్కార లక్ష్యంతో ఈ అధికార యంత్రాంగాన్ని నియమించారు.
- ప్రతి వార్డులో రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు అంటే రెండు గంటల పాటు జలమండలి అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆయా డివిజన్ల వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలు..

డివిజన్ పేరు	వార్డు కార్యాలయం
కొండాపూర్	అంజయ్యనగర్
గచ్చిబౌలి	గౌలిదొడ్డిలోని కమ్యూనిటీహాల్
శేరిలింగంపల్లి	ఆదర్శనగర్ వార్డు కార్యాలయం
చందానగర్	గౌతమినగర్ కమ్యూనిటీహాల్
మియాపూర్	మయూరినగర్ మోడల్ మార్కెట్ భవనం
హఫీజ్‌పేట్	ఓల్డ్ హఫీజ్‌పేట్ హనుమాన్ ఆలయం పక్క భవనం
మాదాపూర్	కాకతీయ హిల్స్ పక్కన వార్డు ఆఫీస్

68 నగరాలలో ఎఫ్‌ఎస్‌టీపీల ఏర్పాటు

ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్

గచ్చిబౌలి: తెలంగాణలోని 68 నగరాలలో ఎఫ్‌ఎస్‌టీపీ (ఫేకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లు ఏర్పాటు చేసినట్లు ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఘన, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ'పై నిర్వహించిన వర్క్ షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి 26 స్వచ్ఛ అవార్డులు వచ్చాయని చెప్పారు. వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో 2016లో కొత్త నిబంధనలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీలలో మానవ వ్యర్థాల నిర్వహణపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ ఘన, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో నూతన ఆవిష్కరణలను వినియోగించుకోవాలని సూచించారు. వ్యర్థాల నిర్వాహణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీడీఎంఏ కమిషనర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యవర్గం



నియామక పత్రాన్ని అందుకుంటున్న సొసైటీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీకి శనివారం కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఎలక్షన్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి ఎన్నికలు నిర్వహించారు.అధ్యక్షులుగా జె.ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బఫారత్ అహ్మద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, కోశాధికారిగా వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శిగా సుబ్రహ్మణ్యశాస్త్రి, ఈసీ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాత పాలకవర్గం రద్దు అయిందని, కొత్త పాలకవర్గం ఐదేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. అనంతరం జరిగిన డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులు జె.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాట్లు కొనుగోలు చేసి నాలుగు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కట్టించుకొని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 385 ప్లాట్లు క్రమబద్ధీకరిస్తే రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తుందన్నారు. డైమండ్ హిల్స్ సొసైటీ ప్లాట్లు బడా నిర్మాణ సంస్థలకు డెవలప్‌మెంట్‌కు ఇవ్వడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఒక ప్లాట్‌కు ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ రావడంతో పాటు నిర్మాణానికి అనుమతి వచ్చిందన్నారు. అందరు ఐక్యంగా పోరాడితే హక్కులు సాధించుకోవచ్చని పేర్కొన్నారు.

భద్రత అనేది సమష్టి బాధ్యత

- ట్రాఫిక్ ఏసీపీ హనుమంతరావు
- మాదాపూర్‌లో వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్‌డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ హనుమంతరావు తదితరులు

మాదాపూర్: భద్రత అనేది సమష్టి బాధ్యత అని ట్రాఫిక్ ఏసీపీ హనుమంతరావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద మెడికవర్ ఆస్పత్రి వైద్యులచే ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్‌డే సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి, ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వల్ల తోటివారి ప్రాణాలను సైతం కాపాడవచ్చని తెలిపారు. డాక్టర్ సతీష్ కైలాసం మాట్లాడుతూ ఆకస్మిక గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, సెప్సిస్‌పాలిట్రామా అనేది మొదటి గంటలో జరిగే చికిత్స గోల్డెన్ అవర్ అని ఆ సమయంలో ఎంత త్వరగా పేషెంట్‌ని దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్తే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు.

భారతీయ భాషల డిక్షనరీలను రూపొందించాలి

రాయదుర్గం: అనువాదాన్ని ప్రోత్సహించేందుకు ప్రాంతీయ భాషల నిఘంటువులను రూపొందించాలని జీఎల్ఏ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పంచానన్ మొహంతి భాషా పండితులకు సూచించారు. గచ్చిబౌలిలోని మనూలో ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో అనువాద సంస్కృతులు-భాష, సాహిత్యం యొక్క విభజనలను అన్వేషించడం అనే అంశంపై నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ మైసూరు సహకారంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం బహుభాషా దేశం అని అన్నారు. ఫ్రాన్స్ ప్రొఫెసర్ అలైన్ డిసొలియర్స్ మాట్లాడారు. ఈ సమావేశంలో డాక్టర్ గోవిందయ్య, సమీనా తబస్సుమ్, రీసెర్చ్ స్కాలర్ టీనా థామస్, సౌదీఅరేబియా, ఉజ్బెకిస్తాన్, నేపాల్, హంగ్‌కాంగ్ విశ్వవిద్యాలయాలకు చెందిన డాక్టర్ సర్వర్ హుస్సేన్, నిలోఫర్ ఖోడ్జావా, భీమ్‌లాల్ గౌతమ్, జాన్ చున్‌యిన్, వక్తలు ఇస్మత్ మెహదీ, హరీష్‌నారంగ్, సురభిభారతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మాటల ప్రభుత్వం

బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలకే పరిమితమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని ఆనంద్‌నగర్, రాఘవేంద్ర కాలనీ సీబ్లాక్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 రోజులుగా జరుగుతున్న పాదయాత్రలో ప్రజలు రేషన్‌కార్డులు, పెన్షన్లు సరిగా రావడంలేదని, డబుల్ ఇళ్ళు నిర్మాణం చేయలేదని ఫిర్యాదులు అందాయన్నారు. 9 ఏళ్ళుగా ప్రభుత్వం శేరిలింగంపల్లికి చేసిందేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని, ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహ్మాయాదవ్, కృష్ణముదిరాజ్, అంజనేయులు, చంద్రశేఖర్‌యాదవ్, రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్ ,కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



మియాపూర్: చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అభిషేకాలు, ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మేథస్సు సమాజానికి ఉపయోగపడాలి



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును సత్కరించిన పూర్వ విద్యార్థులు

- ఆచార్య పరిమి రామనరసింహం
- హెచ్‌సీయూలో పూర్వ విద్యార్థుల సమావేశం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని తెలుగువిభాగంలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమావేశానికి తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య పరిమి రామనరసింహం మాట్లాడుతూ విద్యార్థి వ్యక్తిగతంగా సాధించిన తమ ప్రతిభను సమాజానికి అందేలా చూడాలన్నారు. తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆచార్య దార్లవెంకటేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, తమ విద్యాసంస్థలకు సహాయ సహకారాలను అందించాలని సూచించారు. ఆచార్యులు పిల్లలమర్రి రాములు, డి విజయలక్ష్మీ, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలతో విద్యార్థులు, అధ్యాపకులకు మధ్య ఆత్మీయానురాగాలు పెరుగుతాయన్నారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ తన్నీరు కళ్యాణకుమార్, డాక్టర్ కెవిఎన్‌డి వరప్రసాద్, డాక్టర్ ఆశీర్వాదం, ప్రభాకర్, కరుణ, డాక్టర్ కోలాశేఖర్, డాక్టర్ రవికుమార్, నర్సింహులు, డాక్టర్ గంగరాజు, మూర్తి, రెడ్డిపాషా, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి కార్యశాల

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో పది రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపులో శిక్షణ పొందిన విద్యార్థులు శనివారం కూచిపూడి నృత్యాలతో అలరించారు. నృతహస్తాలు, స్థానకాలు, అడుగులు, జతులు, పూజ నృత్యం, జతిస్వరం, రామాయణశబ్దం, అన్నమాచార్య కీర్తనలను ప్రదర్శించారు. కళాకారులు లలితామృత, దీపిక, మోహన్‌రెడ్డి, అక్షయ, శాన్వి, మణిమాల, సాత్విక, మధులిక, మిత్రవింద, సుదీప్తి, హారిక పాల్గొన్నారు.

అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

- కొత్తగా ఆరు పోలీస్‌స్టేషన్లు ప్రారంభం
- ప్రతీ ఠాణాలో వెయ్యి చొప్పున 50 వేల మొక్కలు నాటుతాం
- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి



రాయదుర్గం: రాష్ట్ర అవతరణ దినోత్సవంను సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 21 రోజులపాటు ఈ వేడుకలను నిర్వహిస్తామన్నారు.

- సైబరాబాద్‌లో కొత్తగా మోకిల, కొల్లూరు, జీనోమ్ వ్యాలీ, అత్తాపూర్, అల్లాపూర్, సూరారంలలో పోలీస్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలుంటాయన్నారు.
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్, తెలంగాణ మహిళా సంక్షేమ కార్యక్రమాలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు, హరితోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.
- ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో 1000 మొక్కల చొప్పున సైబరాబాద్ పరిధిలో 50వేల మొక్కలను నాటాలని నిర్ణయించామన్నారు.
- కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణనాయక్, డీసీపీలు నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, టి శ్రీనివాసరావు, కవిత, నితికాపంత్, రితీరాజ్, యోగేష్‌గౌతమ్, రష్మీపెరుమాల్, ఏడీసీపీలు నంద్యాల నర్సింహారెడ్డి, నరసింహారెడ్డి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మియాపూర్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, జనప్రియ వెస్ట్ సిటీ, లక్ష్మీవెంకటేష్‌నగర్, గ్రీన్ వ్యాలీ, బీకే ఎన్‌క్లేవ్, రెడ్డీస్ ఎన్‌క్లేవ్ కాలనీల్లో రూ.177.25 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యమన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన నితీష్ పుట్ట ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ స్నేహితులతో కలిసి 2022 నుండి రోజువారి గృహ ప్లాస్టిక్ వ్యర్థాలు, వార్త పత్రికలు, ఉపయోగించిన పుస్తకాలను సేకరించి రీ సైక్లింగ్ విక్రేతలు, కొనుగోలు దారులకు విక్రయించి వాటి ద్వారా వచ్చిన 25 వేల రూపాయలతో కాలనీలో ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేశారు .వీరిని ఎమ్మెల్యే గాంధీ అభినందించారు. భవిష్యత్ తరాల కోసం పర్యావరణ హితం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

కాలువల కబ్జాపర్వం



తాజాగా బంధం కొమ్ము కాలువలో మట్టి నింపుతున్న జేసీబీ



గతేడాది ముంపునకు గురైన కాలనీలో పర్యటిస్తున్న అధికారులు

- రియల్ వ్యాపారులకు ఇరిగేషన్ అధికారుల అండ
- రాత్రింబవళ్లు కొనసాగుతున్న పనులు
- ఆందోళనలో ముంపు కాలనీలవాసులు

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ పెద్ద చెరువు, బంధం కొమ్ము చెరువు కాలువలు కబ్జాలకు గురవుతున్నాయి. శంభునికుంట నామ రూపాల్లేకుండా పోతోంది. దీంతో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కబ్జాకు గురైన బంధం కొమ్ముచెరువు కాలువపై వెలుస్తున్న ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి హెచ్‌ఎండీఏ అనుమతులు ఎలా ఇచ్చిందని ఇటీవల స్థానిక ప్రతిపక్ష నేత కాట శ్రీనివాస్‌గౌడ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, నోటీసులు ఇచ్చామని దాటవేశారు. వింత ఏమిటంటే ఏ బడా సంస్థలైతే అమీన్‌పూర్ చెరువుల కాలువల ఎఫ్‌టీఎల్‌ను చెరపట్టి సర్వనాశనం చేశారో ఆ సంస్థలకే ఆ చెరువుల సుందరీకరణ పనులు అప్పచెప్పి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పాలకవర్గం కబ్జాదార్లకు సహకరిస్తోందనే ఆరోపణలను ఇప్పటికే మూట కట్టుకుంది.

రాత్రింబవళ్లు కాలువ పూడ్చే పనులు

బంధం కొమ్ము చెరువు కాలువపై ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి హెచ్‌ఎండీఏ అనుమతులు ఇవ్వడంతో రాత్రింబవళ్లు ఆ కాలువను పూడ్చేందుకు లారీల్లో మట్టి తెచ్చి పోస్తున్నారని ఇరిగేషన్‌శాఖ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలువల్లో ఇష్టానుసారంగా మట్టిని నింపుతుండటంతో ముంపు ప్రాంతాలైన ఎన్‌టీఆర్ ఎంక్లేవ్, దినేష్ హోమ్స్, శివసాయినగర్ కాలనీ, నారాయణరెడ్డి ఫేస్-2 కాలనీ, ఎన్ఎస్ఎల్ కాలనీ, భవానీపురంవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గత వర్షాకాలం ఈ కాలనీలన్నీ జలమయమం కావడంతో అధికారులు పర్యటించినా, నేటికీ సమస్య పరిష్కారం కాకపోగా తాజాగా కాలువల పూడికతో మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం

అమీన్‌పూర్‌లోని చెరువుల కాలువల కబ్జాపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. కబ్జాలు, మట్టి పూడికపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. మండే మార్కెట్‌లో వెలుస్తున్న భవంతికి ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసీ ఇవ్వలేదు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. కోర్టు అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, ఏఈ, ఇరిగేషన్‌శాఖ, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

బ్యాంకు ప్రతినిధుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: బ్యాంకు ప్రతినిధుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన శ్రీనివాస్(38) తోషిబా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం తల్లి చనిపోయింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో ఓ బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. చెల్లింపుల విషయంలో బ్యాంకు ప్రతినిధులు తరచు ఫోన్ చేస్తున్నారు. భార్య లావణ్య ఇటీవల పిల్లలను తీసుకొని వడ్డేపల్లిలోని తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీనివాస్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ సమయంలో బ్యాంకు ప్రతినిధులు మళ్లీ శ్రీనివాస్‌కు ఫోన్ చేశారు. దీంతో ఇంట్లో ప్లాస్టిక్ తాడుతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

జలమండలి ఎండీ దానకిషోర్‌కి ఎమ్మెల్యే విజ్ఞప్తి



జలమండలి ఎండీ దానకిషోర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీ, అమీన్‌పూర్ మండలం, పటాన్‌చెరు డివిజన్ పరిధి సింఫనీ కాలనీలో మంచినీటి సరఫరా సమస్యలను త్వరగా పరిష్కరించాలని జలమండలి ఎండి దానకిషోర్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్లోని జలమండలి కార్యాలయంలో ఆయనతో సమావేశమైన ఎమ్మెల్యే వివిధ అంశాలపై చర్చించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు మంచినీటిని అందించేందుకు ఇప్పటికే మూడు రిజర్వాయర్ల పనులు ప్రారంభించామని, వీటిని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింఫనీ కాలనీకి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఉచితంగా మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయగా స్పందించిన జలమండలి ఎండీ త్వరలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.